


పొయ్యిమీద కూరనీ, పొరుగూర్లో వున్న పెనిమిటినీ ఒక కంట కనిపెట్టాలని రూలు. ఈ రూలు ఆడవాళ్ళకే వర్తిస్తుంది గనక దీన్ని ఆడ రూలు అనుకున్నా నాకేం అభ్యంతరం లేదు. రూలు ఎవరికి వర్తించినా రూలురూలే! బోలెడు ఫిలాసఫీ ఉందిందులో. పరాకుగా వుంటే పొయ్యిమీద కూర మాడిమసవుతుంది. అపారంగా నమ్మితే పొరుగూర్లో భర్త లీలా విలాసాల్లో మండిపోతాడు. అన్ని కేసులూ ఇట్లా అఘోరించక పోయినా ఎక్కువ శాతం ఇట్లాగే ఏడుస్తాయని సర్వే చేసిన పెద్దలు చెప్పారు.

ఇంట్లో భార్య ఉంటే ఏ భర్తయినా భయభక్తుల్లోనే ఉంటాడు. కనీసం వున్నట్లు నటిస్తాడు. వేళకి యింటికి వస్తాడు. ఆవిడ అలిగితే కాళ్ళట్టు

కుంటాడు. స్కూలు పిల్లాడికి మల్లే ఆవిడచేత తలకి నూనె రాయించు కుంటాడు. తల దువ్వించుకుంటాడు. నువ్వు నా పక్కన లేని జీవితమే శూన్యమని కవిత్వం చదువుతాడు. నువ్వే నా ఆరాధ్య దేవతంటూ కొంగట్టుకు తిరుగుతాడు. ఆ విధంగా అతను భార్యా మణికి దాసోహమనడంతో ఆవిడ గారు ఉబ్బితబ్బిబ్బై పోతారు. ఆహా ఏమి నా సౌభాగ్యమని ముచ్చట పడి పోతారు.

ఏమిటోనండి పిన్నిగారూ, వారు నన్నొక క్షణం విడిచి వుండలేరంటే నమ్మండి. కళ్ళ జోడెక్కడుందో, కాలిజోళ్ళెక్కడో అన్నీ నేనే చూడాలి. పెన్నులో ఇంకు పోసి జేబులో పెట్టాలి. ఇన్ని చేసి పంపితే గాని ఆఫీసుకు వెళ్ళలేరు. ఇంట్లో వున్నంత సేపూ అది కావా లిదికావాలని క్షణాని కిరవై సార్లు నన్ను పిలవందే తోచదు. నేనున్నాను గనుక సరిపోయింది. నాకే గనక ఏమయినా అయితే ఈయనగారెట్లా బతుకుతారో ఏమిటో అర్థం కావటం లేదంటే నమ్మండి పిన్నిగారూ అంటూ తన ప్రయోజకత్వం గురించి ఇల్లాలు పక్కింటి పిన్నిగార్తో చెప్పుకునేందుకు ఈ ముచ్చట్లు బాగానే వుంటాయి.

అయితే అదంతా మగవాడి మాయలని ప్రతి ఇల్లాలూ తెలుసుకోవాలి. ఈ సృష్టిలో ఆడ జనాభా ఉత్త అమాయకులు. చిన్న మాటకి పడిపోతారు. ఈ బలహీనత మగవాడికి బాగా తెలుసు. అందుచేతనే మాటలతో మురిపించి తన ప్రైవేట్ వ్యవహారాల్లో చిక్కులు రాకుండా చూసుకుంటాడు. ఇంట్లో వున్నంత సేపూ రాణీ అనీ, దేవతా అని బిరుదులిచ్చి పనులు చేయించు కుంటాడు. అదంతా నల్లమాలిన ప్రేమనుకొని హోరా హోరీగా సేవలు చేస్తారు. భర్తని సోమరిని చేసి నెత్తికెక్కించుకుంటారు. ఆడ మనస్తత్వా నికిప్రక్రియ వచ్చు తునక. ఆ మాటకొస్తే పెళ్ళికాకముందు సదరు భర్త గారు తన పనులు తానే స్వయంగా చేసుకొనేవాడు. తన బ్రహ్మచారి మఠం మేడ మీద మూడో అంతస్తులో వున్నప్పుడు కింద నుంచి బక్కెట్లతో

నీళ్ళుమోసిన రోజులు అతనికింకా జ్ఞాపకమే. అల్లాంటిది పెళ్ళయిం తర్వాత బద్ధకం బలుస్తుంది. కార్యేషు దాసి అని శ్లోకాలు చదివి భార్యని పనిమనిషిగా మార్చేస్తాడు. నువ్వు పనిమనిషివే సుమా అని నిజం చెబితే కేసెక్కడ తిరగబడుతుందోనని తెలివిగా ఆ మాటకి కొన్ని కొటేషన్లతో ముసుగు వేస్తాడు.

భార్య పుట్టింటికి వెడతానంటే ఆనందంగానే వుంటుంది. అట్లా అని చెప్పి ఎగిరి గంతేస్తే బావుండదు గనక ఏడుపు మొహం పెడతాడు. బోలె డంత దిగులుపడి పోతున్నట్లు నటిస్తాడు. నేనూ వద్దును గానీ ఇన్‌స్పెక్షన్ రోజులుకదా సెలవివ్వరని అబద్ధం చెప్పి ఆఫీసు వాళ్ళని తిట్టి పోస్తాడు. వెళ్ళగానే ఉత్తరం రాయమంటాడు. విషయాలున్నా లేకపోయినా రోజుకో వుత్తరం పోస్టు చేయమని నలభై కవర్లు చేతిలో పెడతాడు. అన్ని కవర్లు చూడగానే ఎంత ప్రేమో కదాని మురిసి పోతుందేగాని నలభై రోజులు పుట్టింట్లోనే వుండు అనే విన్నపాన్ని ఆమె పట్టించుకోదు. ఆమె ఎక్కిన రైలు కదిలేంత వరకూ శోకముద్ర మొహంలో చెరిగి పోకుండా జాగ్రత్త పడతాడు. రైలుకదిలి కనుమరుగు కాగానే గాలి పీల్చుకుంటాడు. పీడ విరగ డయ్యిందని పచ్చిగా అనుకోకపోయినా పార్టీ డేస్ కులాసాగా చేసుకోవచ్చని సంబరపడతాడు.

పుట్టింటికి వెళ్ళిన పిచ్చితల్లి భర్త గురించి అనుక్షణం తలపోస్తుంది. అతను చెప్పినట్లు రోజుకో వుత్తరం రాస్తూ పాదదాసి నంటూ సంతకాలు చేస్తూనే వుంటుంది. ఆ ఉత్తరాల్లో కొన్ని చదువుతాడు. కొన్ని చదువ కుండానే బాయిలర్లో వేసి తగలేస్తాడు. ఆవిడ రోజుకో వుత్తరం రాస్తుంటే ఆయన వారానికో వుత్తరం గిలికి ఆఫీసు పనుల్తో బొత్తిగా తీరుబడిలేదని రాస్తాడు. తీరుబడిలేని మాట నిజమే. అయితే అది ఆఫీసు పనివలన మాత్రం కాదనే సంగతి పిచ్చితల్లికి తెలీనివ్వడు. ఫలానా తేదీన ఫలానా

రైలులో అమ్మాయి వస్తుంది గనుక రిసీవు చేసుకోవలసిందని మామగారు
ఉత్తరం రాస్తారు. ఆ ఉత్తరం చదవగానే అప్పటికప్పుడు వేషం మార్చు
కుంటాడు. ఇన్నాళ్ళ తన వీర విహారాలకు చుక్క పెట్టేసి బుద్ధిమంతుడి
వేషంలో రైలు దగ్గిరికెళ్ళి నించుంటాడు. ఆమె కోసం వెయ్యి కళ్ళతో
ఎదురు చూస్తున్నట్లు ఫోజు పెట్టి జవరాలు రాగానే ఆమె కోసం చేతులు
చాచి నిలబడతాడు. ఆహా ఏమి ప్రేమ, ఏమి ఇది, అని ఆమె మూర్ఛ
పోవాల్సిందేగాని దొంగ రాస్కెల్ కాదుగదా అనే డవుటుకి తావే లేకుండా
జాగ్రత్త పడతాడు.

పుట్టింటికి వెళ్ళిన భార్య ఉత్తరమ్ముక్క లేకుండా ఊడిపడితే మాత్రం
ఆ బీభత్సం వర్ణనాతీతం. అల్లాంటి సంపర్కం మా రామ్మూర్తి నెత్తిన ఈ
మధ్యే పడింది. వాళ్ళావిడ ఇంతలో రాదనే ధైర్యంతో సొంత ఇంటిని
క్లబ్బుగా మార్చేడు. ఎక్కడెక్కడి ఫ్రెండ్సుని ఇంటికి రప్పించుకుని సర
దాలు చేసుకున్నాడు. ఆదివారం ఉదయం అనుకోకుండా వాళ్ళావిడ వచ్చిం
దట. ఆ వేళకి హేంగోవర్లో ఉన్నాడు రామ్మూర్తి, అతని అవతారం చూసి
పొలి కేక పెట్టిందట. వంటగదిలో ఖాళీసీసాలా, డైనింగ్ టేబుల్ మీద
పేక ముక్కలా....పకోడి పొట్లాలా....సగం తిని వదిలేసిన కోడికూర
పార్సెల్సా....ఇవన్నీ చూడగానే పిచ్చెక్కిపోయి గుక్క తిప్పుకోకుండా
ఏడ్చేసిందట. ఇంత భయంకర సన్నివేశాన్ని ఎట్లా సరిచేసేవని అడిగేను.
తల దించుకుని కుమిలి పోతాడేగాని అక్షరం బదులివ్వలేదు రామ్మూర్తి!